సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 27 । ఫిబ్రవరి । 2023



పసుపు దిగుబడి భళా

పెదబయలు మండలంలో అత్యధికంగా పసుపు సాగు చేస్తున్నారు. అధిక దిగుబడి వస్తోంది.

8లో



గిరిజనులకు ఉన్నత స్థానం..

గిరిజనులను ఉన్నత స్థానాల్లో నిలబెట్టిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ అన్నారు.

8లో

అడవి పూల అందాలు

డుంబ్రిగుడ: అరకు-పాడేరు ప్రధాన రోడ్డులో లైగండ పంచాయతీ కేంద్రంలో అడవి పూల అందాలు పర్యాటకులను ఎంతో ఆకర్షిస్తున్నాయి.



న్యూస్‌రీల్

మన్యంకొండ జాతరకు పూర్తి స్థాయి ఏర్పాట్లు

చింతూరు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



పాల్లూరులో జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న పీవో సూరజ్ గనోరే

మోతుగూడెం: మన్యంకొండ జాతరకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్టు చింతూరు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. చింతూరు మండలం పాల్లూరులో సోమవారం జరగనున్న మన్యంకొండ జాతర ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు రెండు రాష్ట్రాలకు చెందిన గిరిజనులు భారీసంఖ్యలో తరలివస్తారని, పూజా కార్యక్రమం అనంతరం వారంతా కాలినడకన తమ స్వగ్రామాలకు చేరుకుంటారని తెలిపారు. భక్తులు వచ్చేందుకు సీలేరు నదిపై తాత్కాలిక వంతెన ఏర్పాటు చేసినట్టు చెప్పారు. తహసీల్దార్ సాయికృష్ణ, ఎంపీడీవో రవిబాబు పాల్గొన్నారు.

క్లినిక్‌లు, మెడికల్ షాపుల్లో తనిఖీలు



మెడికల్ షాపును తనిఖీ చేస్తున్న వైద్యులు భాస్కర్,ప్రత్యూష

అడ్డతీగల: మండల కేంద్రం అడ్డతీగలలోని పలు క్లినిక్‌లు, ల్యాబ్‌లు, మెడికల్ షాపులను వైద్యాధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎల్లవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.భాస్కర్ మాట్లాడుతూ ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశాల మేరకు శని,ఆదివారాల్లో తనిఖీలు చేసినట్టు చెప్పారు. కొన్ని క్లినిక్‌లు,మెడికల్ షాపులు,ల్యాబ్‌లు మూసి ఉన్నందున పూర్తిస్థాయిలో పరిశీలించవలసి ఉందని చెప్పారు.

తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం నేడు

చింతూరు: కలెక్టర్ సుమిత్ కుమార్ సూచన మేరకు స్థానిక డిగ్రీ కళాశాలలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ రత్నమాణిక్యం, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కో ఆర్డినేటర్ కోటేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఈ శిబిరంలో సేకరించిన రక్తాన్ని రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు వినియోగిస్తారని వారు తెలిపారు.

పర్యాటక ప్రాంతాలు వెలవెల



పర్యాటకులు లేక వెలవెలబోతున్న చాపరాయి

అనంతగిరి/డుంబ్రిగుడ: జిల్లాలో పలు పర్యాటక కేంద్రాలు సందర్శకులు లేక ఆదివారం వెలవెలబోయాయి. బొర్రాగుహలు, చాపరాయి జలపాతానికి పర్యాటకుల తాకిడి తగ్గింది. ఇంటర్మీడియెట్, పదో తరగతి పరీక్షలు దగ్గరపడుతుండడంతో పర్యాటక ప్రాంతాలను తిలకించేందుకు టూరిస్టులు తక్కువ సంఖ్యలో వస్తున్నారు. బొర్రా గుహలను సుమారు రెండు వేలమంది తిలకించగా, రూ.1.75 లక్షల ఆదాయం వచ్చిందని మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు. చాపరాయి జలపాతం బోసిపోయింది.

అడవి దున్నను చంపిన కేసులో ఆరుగురి అరెస్టు



నిందితులతో అటవీశాఖ అధికారులు

రంపచోడవరం: అడవి దున్న (గొర్ర గేదె)ను చంపిన కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్టు డీఎఫ్‌వో జి.నరేంధిరన్ ఆదివారం తెలిపారు. మారేడుమిల్లి మండలం జలతరంగిణి దగ్గరలో గొర్రగేదె మాంసం కలిగిన మారేడుమిల్లి, చింతూరు మిట్టవాడ ప్రాంతానికి చెందిన బోడి రాజశేఖర్, బాదే రాము, శంఖర్‌రెడ్డి, కలుముల సుబ్బయ్య, రమేష్, మహేష్‌లను అటవీ చట్ట ప్రకారం అరెస్టు చేసి, స్టేషన్ బెయిల్‌పై విడుదల చేసినట్టు తెలిపారు.

పదికి పక్కా ప్రణాళిక..

- టెన్త్‌లో శతశాతం ఫలితాల సాధనపై దృష్టి
- రోజువారీ ప్రత్యేక బోధన
- రెండు పూటలా పరీక్షలు
- 238 ఉన్నత పాఠశాలలు
- 11,113 మంది విద్యార్థులు



అనంతగిరి ఆశ్రమ పాఠశాలలో రాత్రి స్టడీ అవర్‌లో చదువుతున్న టెన్త్ విద్యార్థినులు



రోజువారీ పరీక్షలు రాస్తున్న టెన్త్ విద్యార్థినులు

సాక్షి, పాడేరు: జిల్లాలోని అన్ని యాజమాన్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో టెన్త్ లో నూరుశాతం ఫలితాల సాధనే లక్ష్యంగా విద్యాశాఖ కార్యాచరణ చేపట్టింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం టెన్త్‌కు సంబంధించి 58 రోజుల ప్రణాళికను అమలుజేసింది. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, ఏపీఆర్ పాఠశాలలు, కేజీబీవీలు, ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలు 238 ఉన్నాయి. వీటి పరిధిలో 11,113 మంది విద్యార్థులు టెన్త్ చదువుతున్నారు.

ఏప్రిల్ ఒకటి వరకు కార్యాచరణ

ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం 7గంటల నుంచి రాత్రి నిద్రపోయే వరకు ప్రత్యేక బోధన కార్యక్రమాలను హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు నిర్వహిస్తున్నారు. పాఠ్యాంశాలపై ప్రత్యేక బోధన అందిస్తున్నారు. రాత్రి 9 గంటల వరకు స్టడీ అవర్‌ను కచ్చితంగా అమలుచేస్తున్నారు. అంతేకాకుండా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 3వతేదీ నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం కానుండడంతో ఏప్రిల్ ఒకటో తేదీ వరకు ప్రత్యేక కార్యాచరణను పకడ్బందీగా అమలుచేస్తున్నారు. జిల్లా పరిషత్, ఎయిడెడ్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోను ఉపాధ్యాయులు ప్రత్యేక బోధన కార్యక్రమాలు, రోజు వారీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. సబ్జెక్టు టీచర్లు విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా తగిన సమాచారం ఇచ్చి ఇంటివద్ద కూడా చదివేలా ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటున్నారు. డీఈవో, ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ అధికారులు,ఎంఈవోలు టెన్త్ కార్యాచరణపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

విద్యార్థుల వివరాలు

గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని 159 స్కూళ్లలో 7416 మంది, 31 జిల్లా పరిషత్ పాఠశాలల్లో 1193 మంది, 12 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 532 మంది, 16 గిరిజన గురుకులాల్లో 1243 మంది, 19 కేజీబీవీల్లో 694 మంది, రెండు ఎయిడెడ్ స్కూళ్లలో 35 మంది చొప్పున మొత్తం 238 పాఠశాలల్లో 11,113 మంది చదువుతున్నారు.

నిత్యం పర్యవేక్షణ



జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఎంతో శ్రమిస్తున్నారు. 58రోజుల ప్రత్యేక కార్యచరణ అమలుతో విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో పరిణితి చెందుతున్నారు. ఎంఈవోలు, సమగ్రశిక్ష అధికారులు నిత్యం తనిఖీలు చేస్తూ పర్యవేక్షిస్తున్నారు.

–డాక్టర్ రమేష్, డీఈవో, పాడేరు

ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ



మోడల్ టెస్ట్ పేపర్ల ద్వారా నిర్వహిస్తున్న పరీక్షలు గిరి విద్యార్థులకు ఎంతో మేలు చేస్తున్నాయి. అలాగే టెన్త్ విద్యార్థుల ఆరోగ్యం పట్ల కూడా హెచ్‌ఎం, వార్డెన్, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.

–ఐ.కొండలరావు, గిరిజన సంక్షేమశాఖ డీడీ, పాడేరు ఐటీడీఏ

ప్రిలిమినరీ నోటిఫికేషన్ తేదీయే

కటాఫ్ డేట్

ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభల్లో కలెక్టర్ సుమిత్ కుమార్



రేఖపల్లి గ్రామ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

వీఆర్‌పురం: పోలవరం ప్రాజెక్ట్ ముంపు పరిధిలోని గ్రామాల్లో ఇటీవల ప్రకటించిన ప్రిలిమినరీ నోటిఫికేషన్ తేదీని కటాఫ్ డేట్‌గా పరిగణించనున్నట్టు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. రేఖపల్లి రెవెన్యూ కార్యాలయ ఆవరణలో ఆదివారం పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసిత గ్రామాల ప్రజలతో నిర్వహించిన సమావేశంలో ఆర్‌అండ్‌ఆర్‌కు సంబంధించిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు. కటాఫ్ డే ఆధారంగా 18 సంవత్సరాలు నిండిన యువతీ,యువకులకు పీడీఎఫ్(ప్రాజెక్ట్ డిస్‌ప్లేస్ ఫ్యామిలీ)గా ప్రకటించి వారికీ పరిహారం అందచేయనున్నట్టు చెప్పారు.

నాలుగు గ్రామాల్లో 3675 పీడీఎఫ్‌ల గుర్తింపు

ఇటీవల వరదల్లో మండలంలోని పలు గ్రామాలు ముంపునకు గురయ్యాయని, ప్రభుత్వం దృష్టికి ఇక్కడి ముంపు సమస్యలను తీసుకెళ్లామని చెప్పారు. దీంతో కాంటూరుతో సంబంధం లేకుండా ముంపు గ్రామాలను గుర్తించి తొలి ప్రాధాన్యతా క్రమంలో సర్వే చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందన్నారు.అందులో భాగంగా రాజుపేటకాలనీలో 663,వడ్డిగూడెంలో 947,వీఆర్‌పురంలో 1790, ధర్మతాళ్లగుడెంలో 275 పీడీఎఫ్‌లను గుర్తించి ఇటీవల దశలవారీగా పీఎన్ నోటిఫికేషన్లు జారీ చేసినట్టు చెప్పారు. ఆయా గ్రామాల్లో సర్వే ప్రక్రియ వేగవంతం చేయనున్నట్టు తెలిపారు.

ప్రతీ సమస్యా పరిగణనలోకి ..

ప్రాజెక్టుకు కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులు లేవనెత్తిన ప్రతీ సమస్యను పరిగణనలోకి తీసుకొంటామని కలెక్టర్ తెలిపారు. నిర్వాసితుల్లో గిరిజనులకు పరిహారం అందించి, ఏజెన్సీ ప్రాంతంలోనే వారు కోరుకున్న ప్రదేశంలో కాలనీలు నిర్మించనున్నట్టు చెప్పారు. గిరిజనేతరులకు మాత్రం పరిహారంతో పాటు ఇంటి స్థలం ఇచ్చి,గృహం నిర్మించుకోవడానికి నగదు ఇవ్వడం ఒక విధానమని తెలిపారు. అలా కాకుండా వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌కు అవకాశం కూడా ఉందన్నారు. అనంతరం పలు సమస్యలను నిర్వాసితులు కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఆయన వాటన్నింటికీ సానుకూలంగా సమాధానాలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సతీష్‌కుమార్ ,ఏఎస్పీ మహేశ్వరరెడ్డి,ఇన్‌చార్జ్ ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, తహసీల్దార్ ఎన్ శ్రీధర్,ఎంపీడీవో ఫణీంద్ర ,సీఐ గజేంద్రకుమార్ ,ఎస్ఐ టి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బోట్లను అనుమతించాలని వినతి

పాపికొండల పర్యాటక బోట్లకు అనుమతి ఇప్పించాలని బోట్ యూనియన్ సభ్యులు ఆదివారం కలెక్టర్ సుమిత్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. నేషనల్ పార్క్ పరిధిలో బోటింగ్ నిర్వహించకూడదని అటవీశాఖ అధికారులు శనివారం అభ్యంతరం తెలిపారని వారు కలెక్టర్‌కు చెప్పారు. దీంతో కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించారు. నిబంధనలు అనుగుణంగా బోటింగ్ నిర్వహించుకోవచ్చునని కలెక్టర్ యూనియన్ నాయకులతో చెప్పారు. ఈ కార్యక్రమంలో బోట్ యూనియన్ నాయకులు వాళ్ల రంగారెడ్డి, మాదిరెడ్డి సత్తిబాబు, కొత్త రామోహన్‌రావు,పెందుర్తి సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మొద్దు

కూనవరం: పోలవరం నిర్వాసితులకు పూర్తి న్యాయం చేస్తామని, అసైన్డ్ భూములకు భూమి ఇప్పిస్తామని వస్తున్న మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. మండల పరిధిలోని శబరికొత్తగూడెం , కొండ్రాజుపేట గ్రామాల్లో ఆదివారం పోలవరం నిర్వాసితుల ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభలు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పోలవరం ముంపు జాబితాలో ఏడు గ్రామాలకు తొలిప్రాధాన్యత ఇచ్చి ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కూనవరం, టేకులబోరు, శబరి కొత్తగూడెం, కొండ్రాజుపేట, పంద్రాజుపల్లి, పెదార్కూరు, టేకుబాక గ్రామాలు ఈ జాబితాలో ఉన్నట్టు తెలిపారు. శబరి కొత్తగూడెంలో 434 కుటుంబాలు, కొండ్రాజుపేటలో 223 కుంటుంబాలను గుర్తించినట్టు చెప్పారు. పేర్లు నమోదు కానివారు ఎవరైనా ఉంటే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో జరగనున్న గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సతీష్ కుమార్, చింతూరు ఇన్‌చార్జి పీవో సూరజ్ గనోరే, ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ, సర్పంచ్ కట్టం లక్ష్మి, సున్నం అభిరాం, తహసీల్దార్ కె.అనసూయ, ఎంపీడీవో ఫణీంద్రం, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు చేరాలి

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



మా నమ్మకం నువ్వే జగనన్న కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

వై.రామవరం: ప్రభుత్వం అందిస్తున్న అన్ని పథకాలు అర్హులందరికీ తప్పనిసరిగా చేరేలా చర్యలు తీసుకోవాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తెలిపారు. మండలంలోని తోటకూరపాలెంలో ఆదివారం మండల కన్వీనర్ మామిడి అప్పారావు అధ్యక్షతన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేలా చూడాలని సూచించారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగనన్న కిట్లను వారికి అందజేశారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు ముర్ల జోగిరెడ్డి, వలాల విశ్వమ్మ, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జులు పల్లాల అబ్బాయిరెడ్డి, తోట రాజేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ గుడ్ల త్రిమూర్తులు, బత్తుల సత్యనారాయణ, బలిరెడ్డి నూకరాజు, బచ్చలి రమేష్ , మంచినీళ్ళ నారాయణరావు, పల్లాల తమ్మిరెడ్డి, మడి బాబి, మద్దికొండ భారతిబాబు, తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న ఆటో



ప్రమాదానికి గురైన ఆటో

రంపచోడవరం: మండల కేంద్రం రంపచోడవరం -సీతపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ మధ్య ఆదివారం ప్రయాణికులతో వెళ్తున్న ఆటో చెట్టును ఢీకొట్టడంతో నలుగురు గాయపడ్డారు. ఈ ప్రమాదంలో గంగవరం మండలం ఓజుబంధంకు చెందిన రాజమ్మ, కె.మోహన్‌సాయికల్యాణ్, సతీష్, లక్ష్మిలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తీసుకెళ్లారు. వీరిలో రాజమ్మ పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిసింది.

ఆర్థో సేవల్లో మరో అడుగు

రంపచోడవరం ఆస్పత్రిలో క్లిష్టమైన ఆపరేషన్



ఆపరేషన్ అయిన వ్యక్తితో డాక్టర్ సుధాకర్

రంపచోడవరం: స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఆర్థో సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తున్నాయి. క్లిష్టమైన శస్త్ర చికిత్సలు కూడా ఇక్కడి వైద్యులు చేస్తూ మన్ననలు పొందుతున్నారు. రాజమహేంద్రవరం, కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రులకు పంపకుండా బాధితులకు ఇక్కడే అత్యవసర ఆపరేషన్లు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో వై.రామవరం మండలం కోట పంచాయతీ బొంజుపాలెం గ్రామానికి చెందిన సరబోలు అర్జున్ అనే యువకుడి ఎడమ కాలి ఎముక నుజ్జయింది. పూర్తిస్థాయిలో రక్తప్రసరణ ఆగిపోయింది. రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి వచ్చిన వెంటనే డాక్టర్ కె.సుధాకర్ ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ జరిగి 12 రోజులు గడుస్తోంది. ఆ యువకుడు పూర్తిగా కోలుకున్నాడు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ ఎంతో బాగా ఆపరేషన్ చేశారని, ఇప్పుడు నడవగలననే నమ్మకం కలిగిందని చెప్పాడు.డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ ఆర్థో విభాగానికి సంబంధించి ఎటువంటి క్లిష్టమైన ఆపరేషన్ అయిన రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో నిర్వహిస్తామని, తమ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కాఫీ కొనుగోలు ధర పెంచిన జీసీసీ

- పార్చ్‌మెంట్ కాఫీ కిలో రూ. 285
- చెర్రీకి కిలో 145



సాక్షి, పాడేరు: కాఫీ కొనుగోలు ధరను పెంచినట్టు జీసీసీ డీఎం పార్వతమ్మ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పార్చ్‌మెంట్ కాఫీ కిలో రూ.285, చెర్రీ కిలో రూ.145 ధరతో జీసీసీ కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. కాఫీ రైతులు గమనించి, జీసీసీకి విక్రయించి, లాభాలు పొందాలని తెలిపారు.

మరో అంతర్జాతీయ విమానం

- త్వరలో విశాఖకు శ్రీలంక నుంచి సర్వీసు
- పాలనా రాజధాని కానున్న తరుణంలో శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ ఆసక్తి
- ఇప్పటికే వైజాగ్-సింగపూర్‌ల మధ్య అంతర్జాతీయ విమాన సర్వీసు



శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ విమానం

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయానికి మరో ఇంటర్నేషనల్ విమాన సర్వీసు అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం విశాఖ నుంచి సింగపూర్‌కు ఒక అంతర్జాతీయ విమాన సర్వీసు నడుస్తోంది. త్వరలో శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ విశాఖకు విమాన సర్వీసును నడపనుంది. ఆరేళ్ల క్రితం అంటే 2017లో ఇదే ఎయిర్‌లైన్స్ కొలంబో- విశాఖపట్నంల మధ్య ఒక సర్వీసును ప్రారంభించింది. అప్పట్లో ఆశించినంతగా ప్రయాణికుల ఆదరణ లేకపోవడంతో శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ ఏడాదిన్నర తర్వాత ఈ సర్వీసును రద్దు చేసుకుంది. దీంతో అప్పట్నుంచి శ్రీలంకకు విమాన సర్వీసులు లేకుండా పోయాయి. ఆ తర్వాత కోవిడ్ ప్రభావం చూపింది. ఇన్నాళ్లూ ఎవరైనా ఈ ప్రాంతం నుంచి విమానంలో శ్రీలంక వెళ్లాలంటే హైదరాబాద్, చెన్నైలకు చేరుకుని అక్కడ నుంచి వెళ్లాల్సి వస్తోంది. ఇది ప్రయాణికులకు ఆర్థికంగా పెనుభారం అవుతోంది. ప్రయాణ సమయం కూడా ఎక్కువ తీసుకుంటోంది. విశాఖ-కొలంబోల మధ్య వాయుమార్గంలో 1,249 కిలోమీటర్ల దూరం ఉంది. డైరెక్ట్ ఫ్లైట్‌లో వెళ్లడానికి 2.30 గంటల సమయం పడుతుంది. అదే హైదరాబాద్, చెన్నైలు వెళ్లి, అక్కడ నుంచి శ్రీలంక/కొలంబో వెళ్లాలంటే 10-16 గంటలు తీసుకుంటుంది. ఈ నేపథ్యంలో విశాఖపట్నం కేంద్రంగా పరిపాలన రాజధాని ఏర్పాటవుతుండడంతో శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ మళ్లీ వైజాగ్‌పై దృష్టి సారించింది. విశాఖపట్నం-శ్రీలంకల మధ్య రాకపోకలు సాగించే వారి సంఖ్య పెరుగుతుందని అంచనా వేస్తోంది. శ్రీలంకలో బౌద్ధక్షేత్రాలు, హిందూ పురాణ పుణ్య క్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలున్నాయి. వాటిని సందర్శించడానికి పర్యాటకులు ఆసక్తి చూపుతారు. కోవిడ్ కూడా పూర్తి స్థాయిలో తగ్గుముఖం పట్టిన తరుణంలో పరిపాలన రాజధాని కాబోతున్న విశాఖ నుంచి శ్రీలంకకు టూరిస్టుల సంఖ్య పెరుగుతుందని శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ భావిస్తోంది. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకుని త్వరలోనే కొలంబో-వైజాగ్‌ల మధ్య విమాన సర్వీసును నడపాలని నిర్ణయించినట్టు శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ)మేనేజర్ చింతక పెరేరా తాజాగా వెల్లడించారు.

పెరుగుతున్న విమాన సర్వీసులు

మరోవైపు విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయానికి ఇటీవల కాలంలో విమాన సర్వీసులు క్రమంగా పెరుగుతున్నాయి. విశాఖ నుంచి హైదరాబాద్, ముంబై, ఢిల్లీ, పోర్టుబ్లెయిర్‌లకు ఈనెల 13 నుంచి, 21 నుంచి కొత్త సర్వీసులు మొదలయ్యాయి. ఇంకా మార్చి 3వ తేదీ నుంచి హైదరాబాద్, బెంగళూరులకు కూడా విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి. ఈ ఎయిర్‌పోర్టు నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండడంతో అందుకనుగుణంగా ఆయా విమానయాన సంస్థలు తమ సర్వీసులను విస్తృతం చేస్తున్నాయి.

‘విప్రో’ విస్తరణ.!

- విశాఖలో వెయ్యి సీట్లకు విస్తరించేందుకు ప్రణాళికలు
- సంస్థ ప్రతినిధులతో ప్రభుత్వం, ఎపిటా మంతనాలు
- ఈ ఏడాది చివరినాటికల్లా విస్తరించేందుకు విప్రో సుముఖం
- వీడీఐ, క్లౌడ్ ప్రాజెక్టుల కేంద్రంగా వైజాగ్ బ్రాంచ్

సాక్షి, విశాఖపట్నం: అంతర్జాతీయంగా పేరొందిన ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలు ఇప్పుడు మహా నగరాల నుంచి టైర్-2 సిటీల వైపు చూస్తున్నాయి. టెక్ మహీంద్ర, హెచ్‌సీఎల్, ఇన్ఫోసిస్, యాక్సెంచర్, రాండ్‌స్టాడ్, డబ్ల్యూఎన్‌ఎస్ మొదలైన ఐటీ దిగ్గజ సంస్థలు విశాఖ వైపు అడుగులు వేశాయి. కోవిడ్ సమయంలో వర్క్‌ఫ్రమ్ హోమ్ విధానానికి అలవాటు పడిన ఉద్యోగులు.. తిరిగి కార్యాలయాలకు వచ్చేందుకు ఆసక్తి చూపించని నేపథ్యంలో వారి వద్దకే వచ్చేందుకు ఐటీ సంస్థలు అవసరమైన చర్యలకు ఉపక్రమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తమ వ్యయాల్ని తగ్గించుకునేందుకు సంస్థలన్నీ.. ద్వితీయ శ్రేణి నగరాలపై దృష్టిసారించాయి. ఇందులో భాగంగా విప్రో కూడా విశాఖలో కార్యకలాపాలు విస్తరించేందుకు ముందుకొచ్చింది.

దశల వారీగా వెయ్యి వరకూ...

సత్యం జంక్షన్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 2006 మే నెలలో విప్రో క్యాంపస్‌కు ఏడెకరాల స్థలాన్ని కేటాయించారు. అనంతరం మూడున్నరేళ్ల తర్వాత విప్రో తన కార్యకలాపాల్ని ప్రారంభించింది. 750 మందితో ప్రారంభించాలని భావించినా.. తొలుత 300 మందితో ప్రస్థానం మొదలు పెట్టింది. తరువాత ప్రభుత్వం సరైన ప్రోత్సాహం అందించకపోవడంతో విస్తరించేందుకు సుముఖత చూపలేదు. కోవిడ్ సమయంలో క్రమంగా ఉద్యోగుల సంఖ్యను తగ్గించింది. పరిస్థితులు చక్కబడటంతో మళ్లీ కార్యకలాపాల జోరు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం విప్రో ప్రతినిధులతో చర్చించింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఏపీ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ ఏజెన్సీ(ఎపిటా) గ్రూప్ సీఈవో కిరణ్‌రెడ్డి విప్రో ప్రతినిధి శశికుమార్‌తో దఫ దఫాలుగా చర్చలు జరిపి విస్తరణకు ఆహ్వానించారు. ఐటాప్ ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ కొసరాజు కూడా విప్రో సంస్థకు లేఖలు రాశారు. దీనిపై సుముఖత వ్యక్తం చేసిన విప్రో దశలవారీగా వెయ్యి సీట్లకు విస్తరించేందుకు సిద్ధమని ప్రకటించింది.

వీడీఐ, క్లౌడ్ ప్రోగ్రామ్‌లతో..

విశాఖలో విస్తరణకు విప్రో సరికొత్త ఆలోచనలతో ముందడుగు వేస్తోంది. గత క్యాంపస్‌లో కొంత భాగం ఇప్పటికే అద్దెకు ఇచ్చిన విప్రో.. ముందు భవనంలో సేవలు ప్రారంభించింది. ఈ భవనంలోని అన్ని ఫ్లోర్లలోనూ తమ సంస్థకు మాత్రమే ఉండేలా చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఇందులో అద్దెకు ఇచ్చిన వారిని ఖాళీ చేయించారు. వర్చువల్ డెస్క్‌టాప్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(వీడీఐ), క్లౌడ్ ప్రాజెక్టులకు కేంద్రంగా విశాఖ క్యాంపస్‌ని మార్చాలని నిర్ణయించింది. ఇప్పటికే వీడీఐ ప్రాజెక్టులతో కార్యకలాపాలు ప్రారంభించారు. వెయ్యి మందికి సరిపడా మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులను దాదాపు 90 శాతం పూర్తి చేసింది.



విశాఖలో విప్రో కార్యాలయం

మానవ వనరులను అందించేందుకు సిద్ధం



సంస్థ సేవలను విశాఖలో విస్తరిస్తామని ప్రభుత్వంతో విప్రో స్పష్టం చేసింది. ఈ ఏడాది చివరి కల్లా వెయ్యి సీట్లకు పెంచుతామని చెప్పారు. భవిష్యత్తులో ఈ సంఖ్య మరింత పెరిగేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు విప్రో ప్రతినిధులు హామీ ఇవ్వడం శుభపరిణామం. వైజాగ్‌లో టాలెంట్, అప్‌స్కిల్లింగ్, అనుభవజ్ఞులైన నిపుణులను అందించేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని తెలియజేశాం. భవిష్యత్తులో ఏ క్లెయింట్ వచ్చినా.. ఇక్కడికే తీసుకురావాలని సూచించాం. దానికి కావల్సిన మానవ వనరుల్ని అందిస్తామని స్పష్టం చేశాం. దానికి విప్రో ప్రతినిధులు కూడా అంగీకరించారు. ప్రభుత్వం తరపు నుంచి పూర్తి సహకారంతో పాటు విప్రో ప్రాజెక్టులకు అవసరమైన రిక్రూట్‌మెంట్‌కు కూడా సహకారం అందిస్తామని హామీ ఇచ్చాం. – కిరణ్‌రెడ్డి, ఎపిటా గ్రూప్ సీఈవో

శిక్షణ పొందిన ప్రతీ విద్యార్థి ఉద్యోగాల్లో స్థిరపడాలి



శ్రీధర్‌రెడ్డిని సత్కరిస్తున్న జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ వెంకట సుబ్బయ్య

సీతమ్మధార (విశాఖ ఉత్తర): స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ పొందిన ప్రతీ విద్యార్థి ఉద్యోగాల్లో స్థిరపడాలని ప్రభుత్వ సలహాదారుడు గాది శ్రీధర్ రెడ్డి అన్నారు. ఇండియన్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ (ఐఎస్‌టీడీ) జాతీయ స్థాయి సొసైటీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబరైన గాది శ్రీధర్ రెడ్డిని ప్రభుత్వ సలహాదారుడిగా నియమించిన నేపథ్యంలో దొండపర్తిలోని ఓ హోటల్లో ఆదివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి విజయనగరం జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ వెంకట సుబ్బయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీధర్‌రెడ్డిని ప్రభుత్వ సలహాదారుడిగా నియమించడం హర్షణీయమన్నారు. శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ శిక్షణ పొందిన వారంతా ఆయా రంగాల్లో స్థిరపడేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం శ్రీధర్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ప్రెసిడెంట్ సౌత్ ప్రొఫెసర్ ఎన్.సాంబ శివరావు, విశాఖ చాప్టర్ చైర్మన్ ఓ.ఆర్.ఎం.రావు, సెక్రటరీ హేమ యాదవల్లి, ఎన్.సి.మెంబర్స్ ఠాగూర్, అప్పారావు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

పసుపు దిగుబడి భళా

- దుంప, కొమ్ము సైజు బాగు
- ఈ ఏడాది తగ్గిన పసుపు ధర


కప్పాడ గ్రామంలో పసుపు ఉడికిస్తున్న దృశ్యం


పసుపు పంట సేకరిస్తున్న గిరిజన మహిళలు

పెదబయలు: దేశంలోనే అస్సాం తరువాత అంతటి చాయ పసుపు విశాఖ మన్యంలోనే ఎక్కువగా పండుతుంది. ఇందులో పెదబయలు మండలంలో అత్యధికంగా పసుపు సాగు చేస్తున్నారు. మన రాష్ట్రంలో చాయ పసుపునకు కేరాఫ్ విశాఖ ఏజెన్సీ. పెదబయలు మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో 1, 545 హెక్టార్లలో పసుపు సాగు చేస్తున్నారు. గిరిజన రైతులు కేవలం సేంద్రీయ ఎరువులు ఉపయోగించి మాత్రమే పసుపు సాగు చేస్తున్నారు. ఎండ తీవ్రత ఉన్న జనవరి నుంచి ఏప్రిల్ నెలలు సాగుకు అనుకూలం.

సేకరించిన పసుపును ఇనుప డ్రమ్ములు, సిల్వర్ పాత్రల్లో పెట్టి కట్టెల సహాయంతో ఉడికించిన తరువాత ఎండలో ఎండించిన తరువాత రంగు వచ్చేంత వరకు ఆరబెడతారు.అనంతరం వారపు సంతల్లో తెచ్చి రైతులు విక్రయిస్తారు. ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో పసుపు సేకరణ పనిలో గిరిజన రైతులు నిమగ్నమయ్యారు. దీంతో మండలంలో ఉపాధి పనులు ఉన్న ఎక్కువ మంది కూలీలు రావడం లేదు.ఎక్కువ మంది రైతులు పసుపు, పిప్పిళ్ల సేకరణ పనుల్లో ఉన్నారు.

దిగుబడి బాగుంది

ఈ ఏడాది గిరిజన ప్రాంతంలో వర్షాలు ఎక్కువగా కురువడంతో పసుపు పంటకు అనుకూలంగా ఉంది. దీంతో దిగుబడి బాగుంది. వర్షాలు పడకపోతే కొమ్ము, దుంపల సైజు చిన్నదిగా ఉంటుందని, ఈ ఏడాది సైజు బాగుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.అయితే పసుపు పంటకు సరైన మార్కెట్ ధర లేకపోవడం, కేవలం వారపు సంత మార్కెట్లలో మాత్రమే గిరిజన రైతులు వారు నిర్ణయించిన ధరకు అమ్మకం చేయాల్సి వస్తోందని గిరిజన రైతులు ఆవేదన చెందుతున్నారు.

ధర తగ్గిన పసుపు

గత ఏడాది కిలో పసుపు రూ.90 నుంచి రూ.100 వరకు ధర ఉంటే ఈ ఏడాది పసుపు రూ.50 నుంచి రూ.65 వరకు పలుకుతుండడంతో పసుపు రైతులు నిరాశపడుతున్నారు. ప్రస్తుతం పిప్పళ్ల మార్కెట్ బాగుంది. దీంతో కొంతమంది రైతులు పసుపు, పిప్పళ్ల పంటలకు పండిస్తున్నారు. ఒక పంటకు ధర లేకపోయిన మరో పంటకు ఉన్న గిరాకీ మార్కెట్‌తో నష్టాలు లేకుండా చూసుకుంటున్నారు.

దళారుల బెడద



పసుపునకు ప్రస్తుతం ఆశించినంత గిట్టుబాటు ధర రావడం లేదు. సంతల్లో వ్యాపారులు సిండికేట్‌గా మారడంతో వారు నిర్ణయించిన ధరకే విక్రయించాల్సి వస్తుంది. ఈ ఏడాది దిగుబడి బాగానే ఉంది. యంత్రాంగం పసుపునకు గిట్టుబాటు ధర కల్పించి, దళారీల బెడద నుంచి కాపాడాలి.
–వంతాల భూపన్న, రైతు, గుంజివాడ గ్రామం, పెదబయలు మండలం

పెరిగిన సాగు విస్తీర్ణం



ఈ ఏడాది మండలంలో పసుపు దిగుబడి బాగుంది. వర్షాలు ఎక్కువగా కురుడంతో కొమ్ము,దుంప సైజు పెద్దదిగా ఉంది. అయితే గత ఏడాది కంటే ఈ ఏడాది మార్కెట్‌లో ధర తక్కువగా ఉంది. వర్షాధారంపై ఆధారపడి పండిస్తారు. వర్షపాతం తక్కువగా ఉంటే దిగుబడి రాదు.దీనికి తోడుగా సేంద్రీయ ఎరువులనే రైతులు ఉపయోగిస్తున్నారు.గత ఏడాది కంటే పసుపు సాగు విస్తీర్ణం పెరిగింది. పసుపు ఉడకబెట్టడానికి కొన్ని గ్రామాల్లో డ్రమ్ములు, సామగ్రి పంపిణీ చేశాం.
– ఎ.శ్రీనివాస్, ఏవో, పెదబయలు మండలం

గిరిజనులకు ఉన్నత స్థానం సీఎం ఘనతే


అరకులోయలోని నాయకులు, కార్యకర్తలతో కుంభా రవిబాబు, ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

- సీఎం జగన్‌కు గిరిజనుల కృతజ్ఞతలు
- ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర రవిబాబుకు ఘన స్వాగతం

అనంతగిరి: గిరిజనులకు ఉన్నత స్థానాల్లో నిలబెట్టిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అభ్యర్థి ప్రభుత్వం సిఫార్సు చేసిన తరువాత మొదటిసారిగా అరకులోయకు ఆదివారం విచ్చేసిన, ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబుకు, పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలోని రవిబాబుకు జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ గిరిజనులకు ఉన్నత స్థానాలు అవకాశం కల్పిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామన్నారు. రవిబాబు మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్నవారికి ఎప్పుడు అన్యాయం జరగదని స్పష్టం చేశారు. తనను నమ్మి ఎమ్మెల్సీగా అభ్యర్థిగా సిఫార్సు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రుణపడి ఉంటానన్నారు. గిరిజన అభ్యున్నతికి అహోరాత్రులు శ్రమిస్తానన్నారు. ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు రోషిణి, మత్స్యలింగం, పెదబయలు ఎంపీపీ వరహాలమ్మ, డుంబ్రిగుడ మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి గోపాల్, పీఏసీఎస్ ఇన్‌చార్జి కొములు నాయుడు, సర్పంచులు హరి, వెంకటరావు, అప్పారావు, అశోక్, ఎంపీటీసీ సభ్యులు ఆనంద్, మాజీ జెడ్పీటీసీ శ్రీరాములు, మాజీ ఎంపీటీసీ భాస్కరరావు, చిన్నరావు, నాయకుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి: తొమ్మిది మంది అరెస్టు


పట్టుబడిన పేకాటరాయుళ్లు

కొయ్యూరు: పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. తొమ్మిది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.14.500 నగదును స్వాధీనం చేసుకున్నారు. సీఐ స్వామినాయుడు వాటి వివరాలను ఆదివారం సాయంత్రం వివరించారు. పేకాట జరుగుతుందన్న సమాచారం రావడంతో సీఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో మంప ఎస్‌ఐ లోకేష్‌కుమార్, ఏఎస్‌ఐ చాణక్య, సిబ్బంది కలిసి డౌనూరు పంచాయతీ నిమ్మలపాలెం శనివారం అర్ధరాత్రి వెళ్లారు. గ్రామానికి కొద్ది దూరంలో జీడితోటల్లో పేకాట ఆడుతున్నట్టు తెలుసుకొని దాడులు చేశారు. ఇందులో 9 మంది పేకాటరాయుళ్లను పట్టుకుని అరెస్టు చేశారు. సీఐ మాట్లాడుతూ ఎవరు చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

జీఐఎస్‌కు మిట్టల్, ముఖేష్ అంబానీ

- సదస్సుకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలి
- ప్రారంభోత్సవంలో లేజర్ షో, మా తెలుగుతల్లికి మల్లెపూదండ పాట
- రెండో రోజు సదస్సు కూచిపూడి నృత్యంతో ప్రారంభం
- జిల్లా స్థాయి సమీక్షలో పరిశ్రమల శాఖ డైరెక్టర్ డాక్టర్ సృజన


సమావేశంలో పరిశ్రమల శాఖ డైరెక్టర్ సృజన, విశాఖ కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, తదితరులు

సాక్షి, విశాఖపట్నం : వచ్చే నెల 3, 4 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సుకు ఏర్పాట్లు పక్కాగా నిర్వహించాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ డా.గుమ్మళ్ల సృజన సూచించారు. జీఐఎస్–2023కు సంబంధించి ఏర్పాట్లు, అధికారులు చేపట్టాల్సిన పనులపై కలెక్టర్ డా. మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబుతో కలిసి ఆదివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సృజన మాట్లాడుతూ జీఐఎస్‌కు నవీన్ మిట్టల్, ముఖేష్ అంబానీ, తదితర ప్రముఖ వ్యాపార వేత్తలు, అంబాసిడర్లు, పారిశ్రామిక వేత్తలు హాజరుకానున్నట్లు వెల్లడించారు. సమ్మిట్‌కు వచ్చే పారిశ్రామిక వేత్తలను విమానాశ్రయంలో ఆహ్వానం పలికి.. వారికి వాహనాలు, సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ మైదానంలో ఏర్పాటు చేసిన సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లపై వేదికల వారీగా వివరించారు. ప్రారంభోత్సవంలో లేజర్‌షో, మా తెలుగు తల్లికి మల్లెపూదండ పాటతో ప్రారంభమవుతుందని, రెండో రోజు సదస్సు కూచిపూడి నృత్యంతో మొదలవుతుందన్నారు. ఎంజీఎం గ్రౌండ్‌లో రెండు రోజుల పాటు సాయంత్రం వేళ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. వీటికి సంబంధించి ఆమె పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమ్మిట్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది అవసరమైన ఎంట్రీ పాస్‌లు తీసుకోవాలని సృజన సూచించారు. కలెక్టర్ డా.మల్లికార్జున మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో పనిచేసి సదస్సును విజయవంతం చేయాలని ఆదేశించారు. జీఐఎస్–2023కు నియమించిన నోడల్ అధికారులందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. సదస్సుకు సంబంధించి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని డైరెక్టర్ సృజనకు వివరించారు. ప్రతినిధులు బస చేసే హోటల్స్ వద్ద సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మెడికల్ టీమ్‌లు, అంబులెన్స్‌లు, మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులను కలెక్టర్ మల్లికార్జున ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సీహెచ్ రంగయ్య, టూరిజం ఆర్‌డీ శ్రీనివాస్ పాణి, డీఎల్‌డీవో పూర్ణిమా దేవి, పరిశ్రమల శాఖ అధికారులు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు

అనకాపల్లి రూరల్ : జనరల్ కోర్సుల ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. అనకాపల్లి పట్టణం, గ్రామీణంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో పకడ్బందీగా, కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య పరీక్షలు జరిగాయి. స్థానిక ఏఎంఏఎల్ కళాశాల, శ్రీ చైతన్య, నారాయణ, సాయికుల్వంత్, ఆదినారాయణ మహిళా, హిమశేఖర్ జూనియర్ కళాశాలల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో ఎలాంటి అక్రమాలు జరగకుండా సీసీ కెమెరాల లైవ్ స్ట్రీమింగ్ ద్వారా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇందుకోసం విశాఖ ఆర్ఐవో కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. దీంతో పాటుగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, ప్రత్యేక పరిశీలకులు ఎప్పటికప్పుడు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్నారు. ప్రతి సెషన్‌లో పరీక్ష ముగిసిన వెంటనే విద్యార్థులు రాసిన జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి చేసి, మార్కులను ఓఎమ్ఆర్ పత్రాల్లో వేస్తున్నారు. ఆదివారం పట్టణంలో ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు ఆయా పరీక్ష కేంద్రాల ముఖ్య పర్యవేక్షకులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా జట్టు ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

యలమంచిలి : వచ్చే నెల మార్చి 10 నుంచి 12 వరకు యలమంచిలిలో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ మరియు క్యాడేట్ తైక్వాండో పోటీలకు ఆదివారం జిల్లా జట్టు ఎంపిక జరిగిందని టైక్వాండో కోచ్ నగిరెడ్డి సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యలమంచిలి వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి ఎంపికల్లో సబ్ జూనియర్ బాలికల విభాగంలో 12 మంది, బాలుర విభాగంలో 10 మంది, క్యాడేట్ విభాగంలో 10 మంది బాలికలు, 10 మంది బాలురు ఎంపికయ్యారని తెలిపారు. అండర్ 14 విభాగంలో తలపడే ఈ పోటీల్లో జిల్లాలో యలమంచిలి, అడ్డురోడ్డు, గాజువాక, విశాఖపట్నం, మధురవాడ, నడుపూరు తైక్వాండో క్లబ్‌ల నుంచి 110 మంది క్రీడాకారులు ఈ ఎంపికల్లో పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ములంపాక అచ్చంనాయుడు, సీనియర్ నేషనల్ రిఫరీ కల్లేపల్లి శంకర్, న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అచ్యుతరెడ్డి, యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అరెపు గుప్తా, మాజీ జెడ్పీటీసీ బొద్దపు యర్రయ్యదొర, సీనియర్ అంతర్జాతీయ క్రీడాకారుడు దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జ్యోత్స్నకు రజతం


రజత పతకం సాధించిన ఎ.జ్యోష్ణ

తుమ్మపాల : ఈ నెల 23 నుంచి 27 వరకు జమ్ముకాశ్మీర్‌లో జరుగుతున్న ఫెడరేషన్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ 52 కేజీల బాలికల అనకాపల్లికి చెందిన ఎ.జ్యోష్ణ రజత పతకాన్ని సాధించినట్టు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బద్రీనాథ్ తెలిపారు. ఈ పోటీలలో మన రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన ఆమె స్క్వాట్–120, బెంచి ప్రెస్ 65, డెడెలిఫ్ట్ 135, మొత్తం 320 కేజీల బరువులు ఎత్తి విజయం సాధించిందన్నారు. ఈ విజయం పట్ల హర్షం వ్యక్తం చేసి ఆమెతో పాటు కోచ్ గుండ్రపు నీలాకు అసోసియేషన్ తరపున అభినందనలు తెలిపారు.

స్నేక్ సేవర్ వెబ్‌సైట్ ఆవిష్కరణ

అక్కిరెడ్డిపాలెం: వన్య ప్రాణులతోపాటు మన చుట్టూ సంచరిస్తున్న జంతువులను సంరక్షించాల్సి బాధ్యత అందరిపై ఉందని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్నేక్ సేవర్ సొసైటీ ఆధ్వర్యంలో స్నేక్ సేవర్ వెబ్‌సైట్‌ను మిందిలోని తన నివాసంలో మంత్రి ప్రారంభించారు. విష సర్పాల వల్ల ప్రజలకు ఎటువంటి హాని లేకుండా వాటిని సంరక్షిస్తుండంలో సొసైటీ అధ్యక్షుడు రొక్కం కిరణ్‌కుమార్ చూపుతున్న కృషి అభినందనీయమన్నారు.

పండినా...అగచాట్లే!



సత్యవరం గ్రామానికి చెందిన తమ్మిర్సి గంగారావు గతంలో ఐదెకరాల్లో తమలపాకు తోటలు వేసేవారు. ఇక్కడి నుంచి ఢిల్లీకి కూడా తమలపాకు బుట్టలు రవాణా చేసేవారు. అయితే రవాణా ఖర్చు పెరిగిపోవడం, రైల్లో రవాణా చేసే వీలు లేకపోవడంతో తోటల సాగు తగ్గించుకున్నారు. ప్రస్తుతం రెండెకరాలకే పరిమితం అయ్యారు. తోటలకు తెగుళ్ళు సోకి నత్తగుల్ల పురుగు సోకి ఎర్రగా పండిపోయి చనిపోతున్నాయని, దీంతో దిగుబడి తగ్గి నష్టం వస్తోందని ఆవేదన చెందుతున్నారు. తమలపాకు ఎగుమతికి రైలు ద్వారా రవాణా సౌకర్యం కల్పించాలని, రైతులకు తోటలకు బీమా, రాయితీలు కల్పిస్తేనే సాగు పెరిగి రైతులకు జీవనాధారంగా మారుతుందని చెబుతున్నారు.

- ఆశ, నిరాశల మధ్య తమలపాకు రైతులు
- తెగుళ్ల బెడద, రవాణా సదుపాయాల కొరత
- నానాటికీ తగ్గుతున్న సాగు
- ప్రభుత్వ సహకారం కోరుతున్న రైతులు


రవాణాకు సిద్ధం చేస్తున్న తమలపాకు బుట్టలు


తమలపాకు తోట

పాయకరావుపేట : మండలంలో గల తమలపాకు రైతులు ఆశ, నిరాశల మధ్య జీవనం సాగిస్తున్నారు. మండలంలో సుమారు 500 ఎకరాల్లో రైతులు తమలపాకు తోటలు పెంచుతున్నారు. మంగవరం, సత్యవరం, గోపాలపట్నం, మాసాహెబుపేట, పెదరాంభద్రపురం, చినరాంభద్రపురం, అరట్లకోట, శ్రీరాంపురం గ్రామాలకు చెందిన 2000 కుటుంబాలు తమలపాకు తోటలపై జీవనం సాగిస్తున్నారు. అలాగే ఎస్.రాయవరం మండలంలో కూడా 150 ఎకరాల్లో తమలపాకు తోటలు సాగవుతూ 500 కుటుంబాలకు జీవనాధారంగా ఉన్నాయి. ప్రస్తుతం తమలపాకు ధర కొంతవరకు గిట్టుబాటుగా వున్నప్పటికీ తోటలకి తెగుళ్ల పట్టి చనిపోవడంతో దిగుబడి తగ్గి రైతులకు నష్టాలే మిగులుతున్నాయి.

ఎకరాకు రూ.2 లక్షల ఖర్చు

రైతులు ఎకరం తమలపాకు తోట వేయాలంటే రూ.2 లక్షలు పెట్టుబడి అవుతుంది. రెండేళ్ల పాటు తమలపాకు తోట ఏపుగా వుంటుంది.150 ఆకులతో కూడిన పందా ప్రస్తుతం 40 రూపాయలు ధర పలుకుతుంది. ప్రతి బుట్టకు 20 పందాలు చొప్పున కట్టలు కట్టి ఎగుమతి చేస్తుంటారు. ప్రతిరోజు తమలపాకుల్ని కోసి, ఇక్కడ నుంచి ఎగుమతి చేస్తుంటారు. ఇక్కడ నుంచి అకోలా, పర్భిణీ రకాలు నాగ్‌పూర్, అమరావతి, హైదరాబాద్, బరంపురం, వరంగల్, కరీంనగర్, లక్నో, ఒరిస్సా తదితర ప్రదేశాలకు ఎగుమతి చేస్తారు. ఐదేళ్ల క్రితం ఐదు లేదా ఆరు లారీల సరకు నిత్యం ఎగుమతి అయ్యేది. ప్రస్తుతం తెగుళ్ల కారణంగా తోటలు నాశనం కావడం వల్ల, రైతులకు ప్రభుత్వం ఏవిధమైన పరిహారం ఇవ్వకపోవడం కారణంగా రవాణా గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం మండలం నుంచి రైలు, బస్సులు, వ్యాన్‌ల ద్వారా ఆయా ప్రాంతాలకు 500 బుట్టలు వరకు మాత్రమే ఎగుమతి అవుతున్నాయి. ఫిబ్రవరి నుంచి మే నెల వరకే తమలపాకులకు కొంతవరకు ధర వుంటుంది. మిగిలిన 8 నెలల పాటు ధర గణనీయంగా పడిపోయి, పందా 15 నుంచి 20 రూపాయలు మాత్రమే ధర లభిస్తోంది. దీంతో రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమలపాకు రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

రవాణా సదుపాయం కల్పించాలి

ఇక్కడ నుంచి తమలపాకులు ఎగుమతి చేయడానికి సరియైన రవాణా సౌకర్యం లేదు. గతంలో లింక్ ఎక్స్‌ప్రెస్ ఉండేది. ఢిల్లీకి కూడా ఇక్కడి నుంచి తమలపాకుల బుట్టలు రవాణా చేసేవారు. అది కేన్సిల్ అయింది. ప్రస్తుతం గోదావరికి కూడా రవాణా చేయనీయడం లేదు. ఏపీ ఎక్స్‌ప్రెస్‌కి తుని హాల్ట్ ఇచ్చి, తమలపాకుల రవాణాకి అనుమతి వుంటే బాగుంటుందని పలువురు రైతులు కోరుతున్నారు. ట్రైన్ ద్వారా రవాణా చేసే తమలపాకు బుట్టకి హైదరాబాద్‌కు 40 రూపాయలు ఖర్చయ్యేది. ఇప్పుడు బస్సులో లేదా వ్యాన్ ద్వారా రవాణా చేస్తే 70 రూపాయలు ఖర్చవుతుంది.

ప్రభుత్వ సహకారం అవసరం



మండలంలో 8 గ్రామాల ప్రజలు తమలపాకు తోటలనే జీవనాధారంగా చేసుకుని జీవిస్తున్నారు. తోటలు తెగుళ్ళు వచ్చి చనిపోతున్నాయి. గతంలో కంటే తోటలు దిగుబడి బాగా తగ్గిపోయింది. ప్రభుత్వం సహకారం అందించాలి.
– గూటూరు వెంకటేశ్వరరావు, రైతు, సత్యవరం